# అనంతపురం ప్రెస్ క్లబ్ ను కాపాడుకుంటాం

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా /శ్రీ సత్యసాయి జిల్లా

**తొలి రోజు రిలే దీక్ష విజయవంతం**

**కలెక్టర్ స్పందించాలంటూ.. దిష్టిబొమ్మతో వినూత్న నిరసన**





**అనంతపురం,జూలై12.అక్షర టైమ్స్:-** ఎన్నికలు లేక ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరుకుంటున్న అనంతపురం ప్రెస్ క్లబ్ కు తక్షణం ఎన్నికలు నిర్వహించాలంటూ పలువురు సీనియర్, యువ జర్నలిస్టులు ఆదివారం రిలే దీక్ష చేపట్టారు. ఈ రిలే దీక్షకు అనంతపురం నలుమూలల నుండి రాజకీయ పార్టీలకు అతీతంగా, జర్నలిస్ట్ యూనియన్ సంఘాలకు అతీతంగా, కుల, ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపాయి. రిలే దీక్షలకు ముందు దీక్షా శిబిరంలోనే ఆంధ్రజ్యోతి శింగనమల పాత్రికేయుడు నగేష్ అకాల మరణాన్ని చింతిస్తూ.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు పాటు మూనం పాటించి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్షకు కూర్చున్న వారిలో చెరుకూరి రామాంజనేయులు, ఐ న్యూస్ రవీంద్ర, రామ్మూర్తి, బాబ్జాన్, త్యాగరాజు, అనంత సూర్య ఎడిటర్ హరికృష్ణ, మనం కుల్లాయప్ప, కుంచపు భాస్కర్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దిష్టిబొమ్మపై ప్రెస్ క్లబ్ నామకరణ చేసి చనిపోతుంది కాపాడండి అంటూ.. అయ్యా కలెక్టర్ స్పందించి ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన డిమాండ్లను ప్రస్తావిస్తూ.. ప్రెస్ క్లబ్ కు తక్షణం ఎన్నికలు నిర్వహించాలని, సభ్యత్వాల పేరుతో వసూలు చేసిన మొత్తాలను బహిర్గతం చేయాలని, ప్రెస్ క్లబ్ పారదర్శకత ఎన్నికలకు జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో.. బీజేవైఎం రాష్ట్ర నాయకులు అజేష్ యాదవ్, నిరుద్యోగుల ఐక్యవేదిక టీపీ రామన్న, జననాడు ఉప్పర నవీన్, తెలుగు వెలుగు సాహిత్య రాష్ట్ర నాయకులు టీవీ రెడ్డి, వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకులు అనిల్ కుమార్ గౌడ్, సీనియర్ అడ్వకేట్ నాగన్న, ఈడిగ సంఘం నాయకులు నాగేంద్ర, మహేష్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, భూపాలం సతీష్, భికారి, పి గోపాల్, బాబ్జాన్, కుమార్, ధర్మపీఠం రామాంజనేయులు, సదరం రవి, ఉపేంద్ర, మూర్తి, సాకే బాల పెద్దన్న, కృష్ణమ నాయుడు, బికేస్ కిష్ట, నార్పల వలి, ఫోకస్ మల్లికార్జున, ఇంకా వందలాదిగా జర్నలిస్టు లు స్వచ్ఛందంగా తరలివచ్చారు.

# ఆకాశం వైపే రైతన్న చూపు..!

**వర్షం కోసం వెయ్యికళ్లతో ఎదురుచూపులు**

**ఖరీఫ్‌కు కరువు నీడ.. ఆందోళనలో రైతన్న**

**వాన జాడేదీ...**

**రైతన్న చూపంతా ఆకాశం వైపే!**



**ఉరవకొండ,జులై12.అక్షర టైమ్స్:-** అనంతపురం జిల్లా రైతు భవిష్యత్తును నిర్ణయించేది మార్కెట్ కాదు... ప్రకృతి..! ఖరీఫ్ సీజన్ ప్రారంభమైతే జిల్లాలో ప్రతి గ్రామం సందడిగా మారుతుంది. ట్రాక్టర్ల శబ్దాలు, పొలాల్లో దున్నే పనులు, విత్తనాల కొనుగోళ్లు, ఎరువుల తరలింపు, వ్యవసాయ కూలీల పరుగులు... గ్రామీణ జీవితమంతా వ్యవసాయం చుట్టూనే తిరుగుతుంది. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు వారాలు దాటుతున్నా ఆశించిన వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో వ్యవసాయ కార్యకలాపాలు దాదాపు నిలిచిపోయాయి. పొలాలు సిద్ధంగా ఉన్నాయి... విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి... రైతు సిద్ధంగా ఉన్నాడు... కానీ ఆకాశం మాత్రం ఇంకా కరుణించలేదు. జిల్లాలోని ఉరవకొండ, బెలుగుప్ప, కూడేరు, విడపనకల్, వజ్రకరూరు మండలాల్లో రైతులు తొలి వర్షం కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. ఉదయం లేవగానే ఆకాశం వైపు చూడడం... మధ్యాహ్నం మేఘాలు కనిపిస్తే ఆశపడడం... సాయంత్రానికి అవి చెదిరిపోతే నిరాశ చెందడం... ఇదే ఇప్పుడు రైతు దినచర్యగా మారింది. గత కొద్దిరోజులుగా మేఘాలు కమ్ముకున్నా చినుకు కూడా పడకపోవడంతో రైతుల్లో ఆందోళన రోజురోజుకూ పెరుగుతోంది. "ఇవాళ పడుతుంది... రేపైనా పడుతుంది..." అనే ఆశతో గడుపుతున్న రైతులకు కాలం మాత్రం పరీక్ష పెడుతోంది. అనంతపురం జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా వర్షాధారమే. సాగునీటి వసతి పరిమితంగా ఉండటంతో లక్షలాది ఎకరాల్లో ఖరీఫ్ సాగు పూర్తిగా తొలి వర్షాలపైనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా వేరుసెనగ పంటకు నేలలో తగిన తేమ తప్పనిసరి. ఒక మంచి వర్షం పడితేనే విత్తనం వేయాలని రైతులు ఎదురుచూస్తున్నారు. తొందరపడి విత్తితే విత్తనం మొలకెత్తక నష్టం వస్తుందనే భయం ఒకవైపు... ఆలస్యం చేస్తే దిగుబడి తగ్గుతుందనే ఆందోళన మరోవైపు... ఈ రెండింటి మధ్య రైతు తీవ్రమైన సందిగ్ధంలో ఉన్నాడు. ఈ ఏడాది సాగుపై ఆశలు పెట్టుకున్న రైతులు ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టారు. పొలాలను దున్నించేందుకు ట్రాక్టర్లకు వేల రూపాయలు ఖర్చు చేశారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేశారు. ఎరువులు, సూక్ష్మపోషకాలు ముందుగానే నిల్వ చేసుకున్నారు. చాలామంది సహకార సంఘాలు, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోగా... మరికొందరు ప్రైవేటు అప్పులు చేశారు. పంట వస్తే అన్నీ సర్దుకుంటాయనే ఆశతో ముందుకు అడుగేశారు. కానీ ఇప్పుడు వర్షం లేకపోవడంతో ఆ పెట్టుబడులన్నీ అనిశ్చితిలో పడిపోయాయి. జిల్లాలో వేరుసెనగ కేవలం ఒక పంట మాత్రమే కాదు... వేలాది కుటుంబాల జీవనాధారం. రైతు ఆదాయం, వ్యవసాయ కూలీల ఉపాధి, గ్రామీణ వ్యాపారాల చలనం... అన్నీ ఈ పంటపైనే ఆధారపడి ఉంటాయి. వేరుసెనగ సాగు ఆలస్యమైతే దాని ప్రభావం ఒక్క రైతుపైనే కాదు... మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనే పడుతుంది. ఎరువుల దుకాణాల నుంచి వ్యవసాయ యంత్రాల యజమానుల వరకు ప్రతి ఒక్కరూ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో ఇప్పుడు ఒక విచిత్రమైన నిశ్శబ్దం కనిపిస్తోంది. గతంలో ఈ సమయానికి పొలాల్లో సందడిగా కనిపించే రైతులు ఇప్పుడు చెట్టు నీడలో కూర్చొని ఆకాశం వైపు చూస్తున్నారు. టీ దుకాణాల వద్ద జరిగే చర్చలన్నీ వర్షాల గురించే. మొబైల్ ఫోన్లలో వాతావరణ సూచనలు చూసుకుంటూ, "ఈసారి నిజంగానే వర్షం వస్తుందా?" అని ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. వాతావరణం మారిన ప్రతిసారీ ఆశలు చిగురిస్తున్నా, చినుకు పడకపోవడంతో నిరాశ మరింత పెరుగుతోంది. వర్షాభావం ప్రభావం పొలాలకే పరిమితం కావడం లేదు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పని లేక ఉపాధి తగ్గుతోంది. పశువులకు మేత కొరత మొదలవుతోంది. చెరువులు నిండకపోతే తాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒక మంచి వర్షం కోసం ఎదురుచూస్తున్నది రైతు మాత్రమే కాదు... మొత్తం గ్రామీణ జీవన వ్యవస్థ. ఇప్పటికైనా విస్తారంగా వర్షాలు కురిస్తే ఖరీఫ్ సీజన్ గాడిలో పడుతుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

## ఆంధ్రజ్యోతి రిపోర్టర్ నగేష్ మృతదేహానికి నివాళులర్పించిన తెలుగుదేశం నాయకులు



**శింగనమల,జూలై12.అక్షర టైమ్స్:-** శిశీగనమల మండలం ఆంధ్రజ్యోతి రిపోర్టర్ నగేష్ శనివారం సాయంత్రం గుండెపోటుతో మరణించగా ఆదివారం ఉదయం శిశీగనమల మండల తెలుగుదేశం నాయకులు మండల పార్టీ కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగలకృష్ణమూర్తి సీనియర్ తెలుగుదేశం నాయకులు లాయర్ ఈశ్వర్ రెడ్డిసొసైటీ చైర్మన్ గుర్రం లక్ష్మీనారాయణ నాయి బ్రాహ్మణ డైరెక్టర్ ఆదినారాయణ మాజీ మండల్ పార్టీ కన్వీనర్ చితంబరి దొర ఆయకట్టు సంఘం అధ్యక్షులు సత్యనారాయణ మాసుల చంద్రమోహన్ కొయ్యగూర పెద్దన్న పెరవలి రాము దాదె కృష్ణారెడ్డి అనంత చౌదరి రహంతుల్లా నాగేంద్ర మట్లగుద్ది రమేష్ వడ్డే నాగభూషణం లోలూరు ఓబులేష్ అక్బర్ తదితరులు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి విలేఖరిగా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని మృతుని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని వారు హామీ ఇవ్వడం జరిగింది

## ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరమునకు విశేష స్పందన

**రోటరీ క్లబ్ అధ్యక్షులు బి.జయసింహా**





**ధర్మవరం,జులై12.అక్షర టైమ్స్:-** పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాల యందు నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరమునకు విశేష స్పందన రావడం జరిగిందని అధ్యక్షులు బి. జయసింహ, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి పెద్దారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, క్యాంపు చైర్మన్ కలవల మురళీధర్ తెలిపారు. అధ్యక్షులు జయసింహ మాట్లాడుతూ ఈ కంటి వైద్య శిబిరమునకు దాతలుగా కీర్తిశేషులు కలవల సుకన్య జ్ఞాపకార్థం భర్త కలవల మురళీధర్, కుమారులు కలవల నాగతేజ, కోడలు కలవల సర్వాణి, మనవళ్లు మిహాన్ ,దిశాన్ సుకన్య సిల్క్స్ ధర్మవరం వారు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం దాతను ఘనంగా సన్మానించారు. ఈ శిబిరమునకు 119 మంది కంటి రోగులు రాగా అందులో కంటి వైద్య చికిత్సలు అందించిన తర్వాత 87 మంది ఆపరేషన్కు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ప్రతి శిబిరం దాతల సహాయ సహకారంతో విజయవంతంగా నడిపిస్తున్నామని తెలిపారు. ఇప్పటిదాకా దాదాపుగా 38 వేల మందికి ఆపరేషన్లు నిర్వహించామని, 50 మంది వరకు రోటరీ క్లబ్ తరపున నేత్రదానం కూడా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్రశాల ప్రసన్నకుమార్, శివయ్య, అసిస్టెంట్ గవర్నర్ నరేందర్ రెడ్డి, రమేష్ బాబు, మనోహర్ గుప్తా, సుదర్శన్ గుప్తా, గట్టు హరినాథ్, వెంకటాచలం, రత్నశేఖర్ రెడ్డి, రామకృష్ణ, సోలిగార్ల వెంకటేశులు, కొండయ్య, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు వారి బృందం పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా విజయవంతంగా పూర్తి చేయాలి

**అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి**

**నియోజకవర్గ టిడిపి నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**అర్హులైన ప్రతి ఓటరు నమోదుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి.. ఎమ్మెల్యే దగ్గుపాటి**



**అనంతపురం,జూలై12.అక్షర టైమ్స్:-** ఎస్ఐఆర్ కార్యక్రమం ముగియడానికి మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్, కో-యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర, జిల్లా, నగర కమిటీల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై ఎమ్మెల్యే సమగ్ర న మీక్ష నిర్వహించారు. జూలై 14వ తేదీలోపు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను వేగంగా సేకరించి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని, 2002 ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏవైనా రెండు పత్రాలను సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా పార్టీ నాయకులు వాస్తవాలను వివరించాలని సూచించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే ప్రతి దరఖాస్తును అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి మిగిలిన మూడు రోజులు అత్యంత కీలకమైనవని పేర్కొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నియోజకవర్గంలోని క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్, కో-యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు ప్రత్యేక బాధ్యతతో పనిచేసి అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి జూలై 14లోపు నిర్దేశించిన లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## గాన కోకిల ఎస్. జానకి మృతి పట్ల సంతాపం తెలిపిన కళాజ్యోతి కార్యవర్గం కమిటీ



**ధర్మవరం,జులై12.అక్షర టైమ్స్:-** గాన కోకిల ఎస్ జానకి మృతి పట్ల పట్టణంలోని కళాజ్యోతి కార్యవర్గం కమిటీ వారు తమ సంతాపాన్ని తెలుపుతూ నివాళులర్పించారు. కళాజ్యోతి కమిటీ అధ్యక్షులు కే. నారాయణ, కార్యదర్శి బి. రామకృష్ణ, ఉపాధ్యక్షులు జగ్గా వేణుగోపాల్, సహకార దర్శి పాగాల అశ్వర్థ నారాయణ మాట్లాడుతూ దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచాన్ని ప్రముఖ గాయకురాలు జానకి శోకసముద్రంలో ఉండిపోవడం జరిగిందన్నారు. ఆరు దశాబ్దాలుగా పైగా సినీ సంగీతానికి విశిష్ట సేవలను అందించడం జరిగిందన్నారు. 17 భారతీయ భాషల్లో 48 వేలకు పైగా పాటలు ఆలపించిన అరుదైన గాయని జానకి అని తెలిపారు. దక్షిణ భారత కోకిల గాన కోకిలగా విశేష గుర్తింపు పొందడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. జానపదం, శాస్త్రీయ సంగీతం, మెలోడీ భక్తి గీతాలు తో సహా అన్ని రకాల పాటల్లో అసాధారణ ప్రతిభ చూపిందని వారు కొనియాడారు. తన మధురమైన గాత్రంతో కోట్లాదిమంది అభిమానులను హృదయాలను గెలుచుకున్నారని తెలిపారు. భారతీయ సినీ సంగీత చరిత్రలో ఆమె సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. భారతీయ సినీ సంగీత రంగం ఒక మహోన్నత గాన దిగ్గజాన్ని కోల్పోవడం దురదృష్టకరమని తెలిపారు. అనంతరం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కళాజ్యోతి కమిటీ వారు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రమేష్, రాంప్రసాద్, పెద్దిరెడ్డి ,డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, మధుసూదన్, సోమశేఖర్, ఎల్ఐసి రామన్న, ఓవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే

**లయన్స్ క్లబ్ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన**






**పామిడి,జూలై12.అక్షర టైమ్స్:-** స్థానిక పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు,ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు , బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి ప్రఖ్యాత వైద్య నిపుణులు డాక్టర్ మహిత మాట్లాడుతూ కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా, వైరస్,ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పత్రా శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి,నాగరాజు, కోశాధికారి శిక్షావలి, మాట్లాడుతూ కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతిని, ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర మహిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన 150. మందిని పరీక్షించిగా అందులో 67 మందిని. కంటి ఆపరేషన్ కు ఎంపికైన చేశారు. శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కొరకు నూరు మొక్కలను పంపిణీ చేయడం జరిగింది ఈ వైద్య శిబిరం నందు డిస్టిక్ చైర్ పర్సన్ డాక్టర్ శాంతిప్రియ,డాక్టర్మురళీకృష్ణ జయరాంరావు,రఘువీరరావు మానవ హక్కుల కమిషన్,పర్యావరణ పరిరక్షణ దక్షణభారతదేశ కార్యదర్శి ఆవులప్రసాద్, లయన్స్ క్లబ్ కోశాధికారి షేక్షావలి, ఉపకార్యదర్శి ముండే షేక్షావలి. క్లబ్ నిర్వాహకుడు ఆర్.ఎం.పి వైద్యులు గంగశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రానరేష్,డైరెక్టర్లు పత్రారాకేష్, అంజినాయక్, ప్రసాద్,కొత్తూరు నల్లయ్య, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ, శంకర హాస్పిటల్ సిబ్బంది మరియు లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రి పేరిటన ప్రత్యేక పూజలు చేపించిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి



**రాష్ట్రవ్యాప్తంగా పవన్ కోసం మొక్కులు పూజలు**





**ధర్మవరం,జులై12.అక్షర టైమ్స్:-** జనసేన పార్టీ అధ్యక్షుడు ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జరిగిన శాస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి తోపాటు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి పవన్ కళ్యాణ్ పేరిటన ప్రత్యేక పూజలు అర్చనలను నిర్వహించారు. అనంతరం చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్ర చికిత్స విజయవంతం కావడం ఆ భగవంతుని ఆశీస్సులు అని, భవిష్యత్తులో సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని, మరింత ఉత్సాహంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని వారు తెలిపారు. అనంతరం 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి





**తాడిపత్రి,జూలై 12.అక్షర టైమ్స్:-** తాడిపత్రి నియోజకవర్గ శాసనసభ్యులు జేసీ అశ్మిత్ రెడ్డి ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ముందుగా గుత్తి మండలం పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాట సుంకులమ్మ తల్లి సన్నిధానాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన కేశఖండన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుగు ప్రయాణంలో యాడికి మండలం రాయలచెరువు గ్రామంతో తాడిపత్రి పట్టణంలోని సుంకులమ్మ పాలెంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమాలకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అభిమానులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలతో కాసేపు ముచ్చటించిన ఎమ్మెల్యే, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లు ఆన్లైన్లో చెల్లించాలి : ఎఇ



**పామిడి,జూలై12.అక్షర టైమ్స్:-** విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఇకమీదట పూర్తిగా డిజిటల్ విధానంలోకి తీసుకురావాలని మండల విద్యుత్ శాఖ అధికారి మధుసూదన్ రావు ఆదివారంపత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం ఈ విధానం 50% బిల్లులు ఆన్లైన్లో చెల్లింపులు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియను 100%నికి పెంచుతామన్నారు. ఇకమీదట రెవిన్యూ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆన్లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తామని నగదు వసూళ్ల కేంద్రాలను మూసివేయనుందని ప్రభుత్వం ఆదేశాల ప్రకారం అధికారక యాప్, వెబ్సైట్ ద్వారానే బిల్లును చెల్లించాలని ఏఈ మధుసూదన రావు పేర్కొన్నారు.

## మండల కేంద్రంలో 223 224 బూత్ లలో ఎస్.ఐ.ఆర్ సర్వే ఆకస్మికంగా తనిఖీ చేసిన కదిరి ఆర్డీఓ కళావతి



**నల్లచెరువు,జూలై12.అక్షర టైమ్స్:-** నల్లచెరువు మండల కేంద్రంలోని 223, 224 పోలింగ్ బూత్లలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్.ఐ.ఆర్ సర్వేను కదిరి ఆర్డీఓ కళావతి ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.సర్వే నిర్వహణ తీరును పరిశీలించి, ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనల మేరకు సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు ఈ తనిఖీలో మండల తహసీల్దార్ రవి నాయక్, సంబంధిత బూత్ల బీఎల్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## గాన కోకిల ఎస్ జానకి మృతి పట్ల ఘన నివాళులు





**హిందూపురం, జూలై 12. అక్షర టైమ్స్:-** ప్రముఖ గాయని గాన కోకిల ఎస్ జానకి మృతిపట్ల పట్టణంలోని వివిధ సంగీత కళా క్షేత్రాలు ఘన నివాళులు అర్పించాయి. పట్టణంలోని ఆర్ వి మెలోడీస్ సంగీత కళాకారులు వారి కార్యాలయం నందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి మెలోడీస్ కళాకారులు రాజు, గణేష్, రామకృష్ణ, ముని రంగప్ప ,ఎంఈఓ గంగప్ప ,ముస్తఫా,వసంత, తేజస్విని ,శారద, పద్మావతి తదితరులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం జానకి ఆలపించిన పాటలను పాడి వినిపించారు. అదేవిధంగా కళాకారుల ఐక్యవేదిక సంగీత కళాకారులు స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు ఎస్ జానకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ ఎస్ జానకి తెలుగు ,హిందీ, కన్నడ తదితర భాషలలో వేలపాట్లను పాడి ప్రజల హృదయాల్లో నిలిచారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు శివకుమార్, నారాయణ, దేవాంగ శంకరప్ప, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ నాగభూషణం, సంపూర్ణ తదితర సంగీత కళాకారులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన యుటిఎఫ్ నాయకులు పల్లా లక్ష్మి నారాయణ కుఘన సన్మానం



**ధర్మవరం,జులై12.అక్షర టైమ్స్:-** ధర్మవరం పట్టణానికి చెందిన యుటిఎఫ్ నాయకులు పల్లా లక్ష్మీనారాయణ గత నెల 30వ తేదీన యాడికి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎన్. చిక్కేపల్లి నందు పాఠశాల సహాయకులు (సాంఘిక శాస్త్రం) గా పదవీ విరమణ పొందడం జరిగింది.ఈయన పదవీ విరమణ శుభ ధర్మవరం పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ నందు లక్ష్మీనారాయణ దంపతులకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు, బంధువుల సమక్షంలో ఘన సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్, జిల్లా కార్యదర్శి అమర్ నారాయణరెడ్డి, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ఏపీటీఎఫ్ నాయకులు శంకర్ నారాయణ హాజరై,ఆయన ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థులను తీర్చిదిద్దడం లో చూపిన శ్రద్ధను ప్రశంసించడం జరిగింది అని తెలిపారు. అలాగే యుటిఎఫ్ సంఘ బలోపేతానికి ఆయన చేసిన కృషిని యుటిఎఫ్ నాయకులు ప్రశంసించడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం రూరల్ యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, వెంకట కిషోర్, ధర్మవరం పట్టణ యూటీఎఫ్ అధ్యక్షులు జింక హరికృష్ణ, ధర్మవరం డివిజన్ యూటీఎఫ్ నాయకులు పెద్దకోట్ల సురేష్, ఆదిరెడ్డి ,సకల చంద్రశేఖర్ , ప్రదీప్ కుమార్, పుల్లయ్య, పెద్ద ఎత్తున యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ,శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# ధర్మవరం వంద సంవత్సరాలు చరిత్ర సమాచార సేకరణ కరపత్రం ఆవిష్కరణ

**ధర్మవరం,జులై12.అక్షర టైమ్స్:-** పట్టణంలోని మెహర్ బాబా సెంటర్ ఆధ్వర్యంలో వృద్ధుల వైద్య శిబిరం నందు ధర్మవరం సంస్కృతి, చరిత్ర అంశాలకు సంబంధించిన విషయాలలో సేకరించుటకు ఔత్సాహికులకు అందరికీ అవకాశం కల్పించడానికి సరికొత్త రీతిలో ప్రత్యేక కార్యక్రమం ధర్మవరం మెహర్ బాబా సెంటర్ వారు నిర్వహించారు. రచయిత జయరామిరెడ్డి, సహరచయిత సత్య నిర్ధారణ రూపొందించిన ప్రత్యేక కరపత్రం మెహర్ బాబా సెంటర్ అధ్యక్షురాలు సుజాతమ్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం సుజాతమ్మ మాట్లాడుతూ ఎందరో రచయితలు , పట్టణాల చరిత్ర రాసినప్పటికీ ధర్మవరం చరిత్ర రాయడంలో స్వచ్ఛంద సంస్థలను సంప్రదించడం చాలా ఆనందకరమని, ధర్మవరం పురాతన చరిత్ర గురించి తెలిసిన వారి అభిప్రాయాలు క్రోడీకరించుటకు ప్రత్యేకమైన సమావేశమునకు మా సహకారం అందించమని తెలియజేశారు. సత్య నిర్ధారణ మాట్లాడుతూ ధర్మవరం సంస్కృతి స్వాతంత్ర, సమరయోధులు, పురాతన కట్టడాలు, స్వచ్ఛంద సంస్థల చరిత్ర సెల్ నెంబర్ 9160970235 పుస్తకం వాట్సప్ గ్రూపు తెలియజేయమని కోరారు. మెహర్ బాబా కృష్ణమూర్తి రచయిత గురించి మాట్లాడుతూ , నల్లమాడవాసి మా ధర్మవరం చరిత్ర రాయడానికి ముందుకు రావడం , ఇదొక చారిత్రాత్మక పరిణామ మనీ తెలియజేశారు. ప్రతి దశాబ్దంలో జరిగిన మార్పులు గురించి పుస్తకంలో పొందుపరచడం భావితరాలకు ధర్మవరం చరిత్ర తెలియజేయడంచాలా శ్రమతో కూడుకున్న పనిని తెలిపారు. అనంతరం పాత్రికేయులు, అవార్డుల గ్రహీత నల్లమాడ జయరామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నో పుస్తకాలు రచించినప్పటికీ ఈ పుస్తకం రచనకు ప్రముఖుల నుండి, సంస్థల నుండి విషయ సేకరణ సమయంలోనే నన్ను అభినందించడం, సమావేశ ఏర్పాటు చేయడం , రచయితగా నాకు వచ్చిన మంచి అవకాశం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాగర్జున, లలిత, మెహర్ బాబా ప్రేమికులు, ముఖ్య అతిథి మల్లికార్జున, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



# బూదగవిలో సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు



**ఉరవకొండ,జులై12.అక్షర టైమ్స్:-** మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలసిన శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయం లోని స్వామివారి మూలవిరాట్కు పంచామృతాభిషేకం నిర్వహించారు. వేదమంత్రాల నడుమ విశేష అర్చనలు, అష్టోత్తర శతనామార్చన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం కావడంతో ఉరవకొండతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. హిందూ ధర్మంలో ప్రత్యక్ష దైవంగా పూజలు అందుకునే ఏకైక దేవుడు సూర్యభగవానుడు. వేదాల్లో ఆయనను ఆదిత్యుడు, సవిత, భాస్కరుడు, దివాకరుడు, మిత్రుడు వంటి అనేక నామాలతో కీర్తించారు. జగత్తుకు వెలుగు, వేడి, జీవశక్తిని ప్రసాదించే దేవుడిగా సూర్యనారాయణుడిని ఆరాధిస్తారు. ప్రతి ఆదివారం సూర్యారాధన చేయడం, సూర్యనమస్కారాలు చేయడం, సూర్య గాయత్రీ మంత్రాన్ని జపించడం వల్ల ఆరోగ్యం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. సప్తాశ్వాల రథంపై విహరించే సూర్యభగవానుడు కాలచక్రానికి ప్రతీకగా పురాణాలు వివరిస్తాయి. దేశంలోని ప్రసిద్ధ సూర్యక్షేత్రాల్లో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి విశిష్ట స్థానం ఉంది. అదే విధంగా బూదగవి సూర్యనారాయణ స్వామి ఆలయం కూడా భక్తుల విశ్వాసానికి నిలయంగా కొనసాగుతోంది.. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# బోయ (వాల్మీకి)లకు పూర్తి ఎస్టీ హోదా కల్పించాలి.!

**కుల ధ్రువీకరణ పత్రాలలో డీఎన్టీ ట్యాగ్ను వెంటనే నిలిపివేయాలి..**

**రాష్ట్ర ప్రభుత్వానికి వాల్మీకి సంఘం వినతి**

**ఉరవకొండ,జూలై12.అక్షర టైమ్స్:-** రాయలసీమ ప్రాంతానికి చెందిన బోయ (వాల్మీకి)లను షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) జాబితాలో చేర్చి, కుల ధృవీకరణ పత్రాల్లో డీ-నోటిఫైడ్ ట్రైబ్ (డీఎన్టీ) ట్యాగ్ను చేర్చే నిర్ణయాన్ని నిలిపివేయాలని వాల్మీకి సంఘం నాయకుడు తిప్పయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జారీ చేసిన మెమో నెం. 3070581/దీజఔ/ఖీ/2025 ప్రకారం బోయ (వాల్మీకి) కుల ధృవీకరణ పత్రాల్లో డీఎన్టీగా నమోదు చేసే ప్రతిపాదన తమ సమాజ ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకుడు తిప్పయ్య మాట్లాడుతూ, బోయ (వాల్మీకి) సమాజం దశాబ్దాలుగా పూర్తి షెడ్యూల్డ్ తెగ హోదా కోసం పోరాటం చేస్తోందని తెలిపారు. అలాంటి సమయంలో డీఎన్టీ ట్యాగ్ను అమలు చేయడం వల్ల తమ సమాజం చేస్తున్న చారిత్రక ఉద్యమం బలహీనపడే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. డీఎన్టీ అనేది కేవలం పరిపాలనా గుర్తింపు మాత్రమేనని, దీనికి రాజ్యాంగపరమైన రక్షణ ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే పరిపాలనా నిర్ణయాలతో ఇలాంటి గుర్తింపులు మారే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. గతంలో ఇదే తరహా పరిస్థితులు ఎదుర్కొన్న కొన్ని వర్గాలకు షెడ్యూల్డ్ తెగ హోదా కల్పించారని, అయితే బోయ (వాల్మీకి) సమాజం మాత్రం ఇప్పటికీ బీసీ వర్గంలోనే కొనసాగుతోందని తిప్పయ్య తెలిపారు. అడవులతో మమేకమై జీవించిన తమ సమాజం సంప్రదాయ వేట వృత్తిపై ఆధారపడి జీవించేదని, కాలక్రమేణా చట్టాల మార్పులు, జీవన విధానంలో వచ్చిన పరిణామాలతో ఆ జీవనోపాధిని కోల్పోయిందని చెప్పారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో కూలి పనులు, ఇతర శారీరక శ్రమ ఆధారిత వృత్తులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక భద్రత, సంక్షేమ పథకాల విషయంలో పూర్తి ఎస్టీ హోదా ద్వారా మాత్రమే రాజ్యాంగబద్ధమైన ప్రయోజనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. డీఎన్టీ ట్యాగ్ ద్వారా అలాంటి హక్కులు అందుబాటులోకి రావని, ముఖ్యంగా ప్రమోషన్లలో రిజర్వేషన్లు, ప్రత్యేక గిరిజన సంక్షేమ పథకాలు, ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులు, విద్యా అవకాశాలు, చట్టపరమైన రక్షణ వంటి అంశాల్లో ఎస్టీ హోదా ఎంతో కీలకమని వివరించారు. అందువల్ల బోయ (వాల్మీకి) సమాజానికి సంబంధించిన కుల ధృవీకరణ పత్రాల్లో డీఎన్టీ ట్యాగ్ను అమలు చేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, రాయలసీమ ప్రాంతానికి చెందిన బోయ (వాల్మీకి)లను షెడ్యూల్డ్ తెగ జాబితాలో చేర్చే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేయాలని తిప్పయ్య విజ్ఞప్తి చేశారు. తమ సమాజానికి రాజ్యాంగబద్ధమైన న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు.



# మలబద్ధకం సమస్యా? పెరుగుతో ఈ పదార్థాలను కలిపి తినండి..!



మలబద్ధకం సమస్య తీవ్రమైతే సర్వరోగాలకూ కారణమవుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లకుండా అలాగే ఉండిపోవడమే ఇందుకు కారణం. ఈ సమస్యను సహజంగా తగ్గించుకునేందుకు ఒక చక్కటి మార్గం ఉంది. రోజూ క్రమం తప్పకుండా పెరుగును ఈ పదార్థాలతో కలిపి తింటే జీర్ణక్రియ సవ్యంగా సాగి మలబద్ధకం సమస్య తొలగిపోతుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఈ రోజుల్లో చాలా మంది మలబద్ధకంతో బాధపడుతున్నారు. అలాంటి వారు ఈ సమస్య గురించి ఎవరికైనా చెప్పుకోవాలన్నా సిగ్గుపడతారు. ఒక వ్యక్తికి మలబద్ధకం ఉన్నప్పుడు అతడి దృష్టి నిరంతరం కడుపుపై ఉంటుంది. ఇది రోజువారీ పనులలో ఇబ్బందిని కలిగిస్తుంది. చాలా బాధాకరంగా ఉంటుంది. మలబద్ధకం వల్ల అపానవాయువు, నొప్పి, అసౌకర్యం కలుగుతుంది. అందుకే ఇలాంటి వ్యక్తులు ఏకాగ్రతతో పనిచేయలేరు. ఈ సమస్యతో బాధపడుతున్న వ్యక్తులు బాత్రూంకు వెళితే గంటల తరబడి కూర్చున్నా శరీరం తేలికగా అనిపించదు. తరచుగా కడుపు నొప్పి, గ్యాస్, తలనొప్పి వంటి సమస్యలు మొదలవుతాయి. అటువంటి పరిస్థితిలో, వారు కొన్ని మందుల సహాయం తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ, మీరు కొన్ని జాగ్రత్తలు తీసుకొని..ఈ ఇంటి నివారణలను పాటిస్తే మలబద్ధకం సమస్య నుండి బయటపడవచ్చు. ముఖ్యంగా, ఇంట్లో ఉండే కొన్ని ఆహార పదార్థాలు ఈ సమస్యను పూర్తిగా తొలగించగలవు. దీని కోసం, డైటీషియన్లు ఒక చిట్కాను సూచిస్తున్నారు. మీరు కొన్ని పద్ధతుల్లో పెరుగు సేవిస్తేఈ సమస్య నుండి బయటపడవచ్చు.

### పెరుగును ఇలా తినండి

తక్కువ ఫైబర్ ఉన్న ఆహార పదార్థాలు తినడం, శారీరక శ్రమ లేకపోవడం, తరచుగా ప్రయాణాలు చేయడం, ఒత్తిడి, కొన్ని సమస్యలకు మందులు అధికంగా తీసుకోవడం, జీర్ణవ్యవస్థ సమస్యలు, థైరాయిడ్ సమస్యలు, నాడీ సంబంధిత సమస్యల వల్ల మలబద్ధకం సంభవించవచ్చు. అటువంటి పరిస్థితిలో, ఈ సమస్యను తగ్గించుకోవడానికి, రోజుకు కచ్చితంగా 100 గ్రాముల తాజా పెరుగు తీసుకోవాలి. దానికి ఒక టీస్పూన్ అవిసె గింజలు లేదా అవిసె గింజల పొడి వేసి బాగా కలిపిన తర్వాత.. ఉదయం ఖాళీ కడుపుతో లేదా రాత్రి భోజనం తర్వాత తీసుకోండి. ఇది కొన్ని రోజుల్లో ఈ సమస్య నుంచి బయటపడటానికి మీకు సహాయపడుతుంది.పెరుగు ఒక ప్రోబయోటిక్ ఆహారం. ఇందులో మన కడుపును ఆరోగ్యంగా ఉంచే బ్యాక్టీరియా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియ, ప్రేగు కదలిక మెరుగుపడుతుంది. పెరుగులో కాల్షియం, భాస్వరం వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తాయి. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా చేస్తాయి. మలబద్ధకం, ఇతర జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. దీనితో పాటు, ఇందులో ఉండే పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇది ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. వ్యాధులతో పోరాడుతుంది. ఇందులోని తక్కువ కేలరీలు శరీర బరువును నియంత్రణలో ఉంచుతాయి. పెరుగులో ప్రోటీన్ ఉంటుంది. ఇది బరువును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. పెరుగును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె సంబంధిత సమస్యలను నివారిస్తుంది. అవిసె గింజల్లో కరిగే, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. అవి మలాన్ని మృదువుగా చేసి కడుపును శుభ్రపరుస్తాయి. వాటిలో ఉండే ఫైబర్ మలబద్ధకం నుంచి ఉపశమనం పొందడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఫైబర్ కడుపు నిండుగా ఉంచడంలో, బరువు తగ్గించడంలో సహాయపడుతుంది.

